క్లుప్తంగా

హుండీ లెక్కింపు



దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.16,93,056 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సన్నిగళ్ళ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి ఆధ్వర్యంలో 48 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ గ్రూప్ టెంపుల్స్ ఈఓ కొల్లి హనుమంతరావు, కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు, ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి తొడుగు.. అమ్మవారికి ముక్కపుడక



సత్రశాల(రెంటచింతల): సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎంతో పురాతనమైన ఈ శైవక్షేత్రంలోని స్వామివారికి పాలువాయి గ్రామస్తులు లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు రూ.22 వేల విలువైన తొడుగును బహూకరించారు. స్థానిక ఏపీ జెన్‌కో అధికారి కోటయ్య దంపతులు రూ.20 వేల విలువైన బంగారు ముక్కపుడకను భ్రమరాంబికాదేవికి బహూకరించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



మాచర్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణచలానికి ఈ నెల 24వ తేదీన మాచర్ల నుంచి సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 7 గంటలకు బయలు దేరుతుందని ఆర్టీసీ డీఎం ఆర్ పిచ్చయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల నుంచి డిసెంబర్ 24న బస్సు బయలుదేరి 25న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, 26న అరుణాచలంలో గిరిప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం, తిరిగి డిసెంబర్ 27న ఉదయం 7 గంటలకు మాచర్లకు చేరుతుందన్నారు. ప్రయాణానికి రానుపోను ఒక్కొక్కరికి రూ.2,750 టికెట్ ధర ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 73828 95100, 73828 01048, 99592 25432లను సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

పెదకూరపాడు: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని హుస్సేన్‌నగరం ఆర్సీయం చర్చి వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాతులూరి పుల్లమ్మ (80) ఎస్సీకాలనీలోని ఆర్సీయం చర్చి వద్ద నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా ఏపీ03జెడ్ 0016 నెంబరు ఆర్టీసీ బస్సు పుల్లమ్మను వెనుక నుంచి ఢీకొనడంతో పుల్లమ్మ బస్సు వెనుక చక్రాల కింద పడి తల పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి భర్త 40 సంవత్సరాల క్రితమే మృతి చెందగా, సంతానం లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్ నగదుతోనే జీవనం సాగిస్తున్నారు. పెదకూరపాడు ఎస్ఐ వెంకట్రావు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రాజుపాలెం: అతి వేగంతో లారీ స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెం పెట్రోల్‌బంక్ సమీపంలో మాచర్ల–గుంటూరు రహదారిపై గురువారం చోటు చేసుకుంది. గుంటూరు కొండ వెంకటప్పయ్య కాలనీకి చెందిన షేక్ పెద్దనాగూర్ హుస్సేన్(36), గుజ్జనగుండ్లకు చెందిన పఠాన్ నజీర్, షేక్ మస్తాన్‌సైదాలు ఇళ్లల్లో మార్బుల్ పరుస్తుంటారు. అదే క్రమంలో గురజాలలో మార్బుల్ పరిచే పని ముగించుకుని గురువారం స్కూటర్‌పై ముగ్గురు గుంటూరు బయలుదేరారు. మార్గంమధ్యలో అతివేగంగా వస్తున్న లారీ స్కూటర్‌ను వెనుక ఢీకొనడంతో వెనుక కూర్చొన్న నాగూర్‌హుస్సేన్ లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు అవతలవైపు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కిరణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు



అడిగొప్పలలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తున్న పార్టీ నేతలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



కరపత్రాలను ప్రారంభిస్తున్న మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు

గురజాల : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు కనకం ఆదినారాయణ దత్తు అన్నారు. స్థానిక సచివాలయం 4 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి..

దుర్గి: మండలం పరిధిలోని కోలగొట్ల, అడిగొప్పల గ్రామాలలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పార్టీ నేతలు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలందరూ మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను పంపిణీ చేశారు. కోలగుట్ల సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అడిగొప్పలలో ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన లబ్ధిని పార్టీ నేతలు వివరించారు. నాయకులు ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందిన లబ్ధిని కరపత్రం ద్వారా వివరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోలగుట్లలో ఎంపీపీ ఏసూరి సాయిశంకర్, జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, సర్పంచ్ మద్దికర శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, ఎంపీటీసీ నక్క ఆదినారాయణ, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, జేసీఎస్ కన్వీనర్ బొబ్బ సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు వెంకటరెడ్డి, శ్రీనివాస్, ఆదిరెడ్డి, మంగారావు, రామయ్య, యలమంద, అడిగొప్పలలో సర్పంచి నలబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, సచివాలయ కన్వీనర్లు రాయల మధుబాబు, అంబారావు, పార్టీ నాయకులు నాగుల్ మీరా, సుభాని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనన్న సీఎం అయితేనే అభివృద్ధి

వెల్దుర్తి: ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలని మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిపారు. సచివాలయ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, కరపత్రాలను ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, ఎంపీటీసీ కె రాజయ్య, సర్పంచ్ మొగిలి గోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, మార్కొండయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ అంజిబాబు, గాలయ్య, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, సీతారామిరెడ్డి, మల్లయ్య, మల్లిఖార్జున, శ్రీనివాసరావు, నన్నేబాబు, పెద గోవిందు, వలంటీర్లు, గృహ సారథులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో 10 రెట్లు అభివృద్ధి చేశాం..

- రూ.354.20 కోట్లతో మాచవరం మండలంలో సంక్షేమం, అభివృద్ధి
- గురజాల శాసనసభ్యుడు కాసు మహేశ్‌రెడ్డి



మాచవరంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు

మాచవరం: నలభై సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ చేయలేని అభివృద్ధి పనులు, ఇవ్వలేని సంక్షేమ పథకాలను కేవలం నాలున్నర ఏళ్లలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 10 రెట్లు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసి చూపించిందని, ఒక్క మాచవరం మండలంలో రూ.354.20 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గురజాల శాసనసభ్యుడు కాసు మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేమవరం, రేగులగడ్డ, చెన్నాయపాలెం, మాచవరం, తురకపాలెం, గంగిరెడ్డిపాలెం, పిల్లుట్ల, కొత్తపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనేఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి, ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజాభిమానాన్ని పొందినట్లు చెప్పారు. సంక్షేమ రాజ్యం కావాలంటే మరలా ఏపీకి సీఎం జగన్ అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని, ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని ప్రతి ఇంటికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పులిచింతల నిర్వాసితులకు పరిహారం త్వరలోనే అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు మండలంలో లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మాచవరం నుంచి రేగులగడ్డ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు.

రూ.3.90 కోట్లతో పైప్‌లైన్ల నిర్మాణానికి శంకుస్థాపన ..

మండలంలోని మాచవరం, కొత్తపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా రూ.3.90 కోట్ల నిధులతో ఇంటింటికీ కొళాయి ఏర్పాటుకు పైప్‌లైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కాసు శంకుస్థాపన చేశారు. త్వరలో పనులు చేపట్టి వచ్చే వేసవి నాటికి ప్రతి ఇంటికీ మంచినీటిని అందిస్తామని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు పూర్తి కాగా, మరి కొన్ని గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్నాయని తెలియజేశారు. మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివా యాదవ్, వైస్ ఎంపీపీ నన్నేషైదా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వి.రమేష్, జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాభక్షు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచులు కనకారెడ్డి, వెంకాయమ్మ, మంగమ్మ, నరేష్, కృష్ణవేణి ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, గురవయ్య, లక్ష్మిబాయి, మంగమ్మ శివరామయ్య, అనురాధ, బ్రహ్మారెడ్డి, పుల్లారెడ్డి, మండల నాయకులు సైమన్, సురేష్, రామిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేదలకు ఓ వరం

ప్రభుత్వ విప్ పీఆర్కే



రెంటాల గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న పీఆర్కే

రెంటచింతల: గ్రామాలలోని పేదలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఓ వరం అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రెంటాల గ్రామంలో రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలను క్షేత్రస్థాయిలో అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఎం జగన్ గ్రామాలలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చేస్తున్న కృషి చిరస్మరణీయమన్నారు. రెంటాల గ్రామస్తులకు ఇప్పటి నుంచి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కిరణ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, పల్నాడు జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, పార్టీ నేతలు పేరం పెద సీతారామిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, జక్కిరెడ్డి లచ్చిరెడ్డి, పేర్ల ముత్తయ్య, కొక్కెండ్ల బ్రహ్మం, పత్తి కోటిరెడ్డి, గాలి లక్ష్మారెడ్డి, ఇగుటూరి శ్రీనివాసరెడ్డి, పమ్మి గురువారెడ్డి, నవులూరి రంగారెడ్డి, వైద్యాధికారి నర్రా కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి ఉత్సవాల ఏర్పాట్ల పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పల్నాటి వీరారాధన ఉత్సవాల ఏర్పాట్ల పనులను కారెంపూడి గ్రామ పంచాయతీ పాలక వర్గం గురువారం సాయంత్రం ప్రారంభించింది. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, జెడ్పీటీసీ షేక్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, కరాలపాటి సుబ్బారావు తదితరులు కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. నాగులేరు పరిసరాలలో పిచ్చి చెట్లు తొలగించే పనులు జరిగాయి. అదే విధంగా వీరుల గుడి ఆవరణలో ఉన్న చెట్లను తొలగించి ఉత్సవాలు జరిగే స్థలాన్ని శుభ్రం చేయడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు కూడా నాగులేరు వాగు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెత్త ఇతర వ్యర్థాలను వాగులో వేయవద్దని కోరారు. వాగు కాలుష్యానికి కారణమయ్యే వారిపై తగిన నిఘా ఉంచుతామన్నారు. గంగధారి మడుగుకు వెళ్లే దారి దాని పరిసరాలను పాడు చేయవద్దని కోరారు.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగర పంచాయతీ

- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- త్వరలో 1,500 మందికి ఇళ్ల స్థలాలు
- చైర్‌పర్సన్ సుబ్బమ్మ



నగర పంచాయతీ సమావేశంలో అజెండా వివరిస్తున్న దృశ్యం

దాచేపల్లి : మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. స్థానిక వార్డు సచివాలయంలో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన గురువారం జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. నాయుడుపేట సమీపంలోని జగనన్న కాలనీ ముఖద్వారానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, గోగులపాడు రోడ్డులోని జగనన్న కాలనీ ముఖద్వారానికి కాసు బ్రహ్మానందరెడ్డి, ఇరికేపల్లిలో బాబు జగ్జీవన్‌రామ్, దుర్గాభవానీ కాలనీలో మహాత్మ జ్యోతిరావుపూలే పేర్లు పెట్టేందుకు తీర్మానించారు. 17వ వార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. డిసెంబర్ మొదటి వారంలో నగర పంచాయతీ పరిధిలో 1,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే పనులు త్వరలో చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ వి.సత్యనారాయణ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి



ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియచేస్తున్న అధికారులు



ఐలాండ్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపాలిటీ, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు

గురజాల : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి వుండాలని రెవెన్యూ డివిజన్ అధికారి రమణాకాంత్‌రెడ్డి సూచించారు. స్థానిక వాగ్దేవి కళాశాలలో గురువారం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవచ్చన్నారు. ఓటు నమోదు కొరకు ప్రతిజ్ఞ చేయించారు. ఫారం–6 దరఖాస్తులను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో కె.ఆంజనేయులు, తహసీల్దార్ మీసాల దానియేలు తదితరులున్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోండి

పిడుగురాళ్ల: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వక్తలు అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ, రెవెన్యూ, సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో ఓటర్ నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అదేవిధంగా వేరు వేరు చోట్ల ఓట్లు ఉంటే తొలగించటం, చేర్పులు, మార్పులు చేయటం జరుగుతుందని అన్నారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐలాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంపూర్ణ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

నాగులవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం



నాగులవరం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

విజయపురిసౌత్: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశ ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు లబ్ధిదారులు పథకాల గురించి తెలుసుకునేందుకు అవగాహన సదస్సులు నిర్వహించి మెడికల్ క్యాంపులు జరపటం ఎంతో మంచి కార్యక్రమమని మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ అన్నారు. గురువారం నాగులవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ మంగమ్మ, ఎంపీడీఓ సరోజని దేవి, ఎంఈఓ నాగయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పథకాలను కల్పిస్తూ మెడికల్ క్యాంపులతో పాటు అంగన్‌వాడీ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవగాహన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్‌డి కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ వెంకట్రావమ్మవెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బైపాస్ పనుల వద్ద కార్మికుడి మృతి

యడ్లపాడు: బైపాస్ నిర్మాణ పనులు చేస్తూ వలస కార్మికుడు మృతి చెందిన ఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. తిమ్మాపురం నక్కవాగు వద్ద నుంచి చిలకలూరిపేట మండలంలోని రామచంద్రపురం సమీపం వరకు బైపాస్ రహదారి పనులు కొంతకాలంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తిమ్మాపురం వద్ద కొద్దికాలంగా హైలెవల్ వంతెన నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఆయా పనులకు జార్ఖండ్‌కు చెందిన 30 మంది వలస కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం వంతెన వద్ద సెంట్రింగ్ పనులు చేస్తుండగా, సెంట్రింగ్‌కు అమర్చే ఇనుప ప్లేట్ జారీ సరిగ్గా కింద ఉన్న కార్మికుడిపై పడింది. దీంతో జార్ఖండ్‌లోని లతహర్ జిల్లా కేర్ గ్రామానికి చెందిన సంజయ్‌బుయా(28) అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

వరి అ'ధర'హో

- దిగుబడులు సైతం ఆశాజనకం
- పదిరోజుల్లో ముమ్మరం కానున్న కోతలు



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో విడుస్తున్న హార్వెస్టర్



కారెంపూడిలో కోతకు వస్తున్న వరి పైరు

కారెంపూడి: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం ధర రికార్డు స్థాయిలో పలుకుతోంది. 75 కిలోల బస్తా రూ.రెండు వేలు ధర పలుకుతోంది. వ్యాపారులు వరి కోసిన రైతు వద్దకు వెళ్లి కల్లంలోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ధాన్యం కొనుగోలుకు ఉత్సాహం చూపడం కూడా ఇదే మొదటి సారి. ప్రభుత్వ మద్దతు ధర రూ.1,840 మించి బయటే కొనుగోళ్లు జరుగుతున్నాయి. మద్దతు ధరకు అమ్మాలంటే ధాన్యం బాగా ఆరాలి. తేమ శాతం కూడా రెండుకు మించి ఉండకూడదు. తారం కూడా తీసివేస్తారు. కానీ ఇలాంటివేమీ లేకుండా ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని మంచి ధరకు అమ్ముకోగలుగుతున్నారు. ఈ రేటు భవిష్యత్తులో ఎలా ఉంటుందో కానీ ముందస్తు నాట్లు వేసిన రైతులు ప్రస్తుతం వరిని హార్వెస్టర్లతో కోయిస్తున్నారు. కోసిన వెంటనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా కల్లంలోనే అమ్ముకుంటున్నారు. పూర్తి స్థాయిలో కోతలు పది రోజుల్లో ప్రారంభమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. అయితే సాగర్ కాల్వలకు నీరు రాక పోవడంతో పల్నాడులో వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. కేవలం బోర్ల కిందనే వరి సాగులో ఉంది. పిడుగురాళ్ల ఏడీఏ కార్యాలయం పరిధిలో 10,250 ఎకరాలలో వరి సాగులో ఉంది. దుర్గి, దాచేపల్లి, వెల్దుర్తి మండలాల్లో తప్ప మిగిలిన మండలాల్లో వరి సాగవుతోంది. కారెంపూడిలో 950 ఎకరాలు, రెంటచింతలలో 3,500, మాచర్లలో 500, గురజాలలో 500, మాచవరంలో 500, నకరికల్లులో 3,500, పిడుగురాళ్లలో 800 ఎకరాలలో వరి సాగులో ఉంది. ప్రస్తుతం కొన్ని మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. మరో పది రోజుల్లో నూర్పిళ్లు ముమ్మరం కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం ధర బావుడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బియ్యం ధర కూడా మూడు నెలల క్రితమే పెరిగింది. 50 కిలోల బియ్యం రూ.3 వేలు ధర పలుకుతున్నాయి.

ఈ రేటు ఉండడం ఇదే ప్రథమం..



వరి ధాన్యానికి రూ.2 వేలు పలకడం ఇదే ప్రథమం. మద్దతు ధరకు మించి రూ.400 ఎక్కువ ధర పలకడం ఇదే తొలి సారి. ముందస్తుగా వేసిన వరి కోతలు జరుగుతున్నాయి. చినగార్లపాడు, గాదెవారిపల్లె, చింతపల్లి గ్రామాలలో వరికోతలు జరిగాయి. చింతపల్లిలో 40 బస్తాల దాకా దిగుబడి వచ్చింది. మరో వారం, పది రోజుల్లో కోతలు ముమ్మరం కానున్నాయి. బోర్ల ఇతర నీటి వనరుల ద్వారా నీరు పెట్టుకుని కష్టపడి వరి పండించిన రైతులకు మంచి లాభం వస్తుంది.

–బి యలమందారెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి

వరి పంట ఈ సారి బాగుంది..



నేను మూడెకరాలలో బోరు కింద వరి సాగు చేశాను. వరి పంట ఈ సారి బాగా పండింది. మరో వారం పది రోజుల్లో కోతకు వస్తుంది. ధర కూడా బస్తా రూ.2 వేలు అని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధర నేను ఇప్పుడే వినడం. కాల్వలకు నీరు రాక వరి సాగు లేకపోవడంతో ధాన్యానికి ధర వచ్చింది. మళ్లీ రెండవ పంట కూడా వరి వేయడానికి నారుమడి సిద్ధం చేస్తున్నాను.

– బొరిగొర్ల గురువులు, రైతు, ఒప్పిచర్ల, కారెంపూడి మండలం

వైభవంగా హరిహర బాల నాగేంద్ర స్వామి తిరునాళ్ల



ధర్మవరంలో బాల నాగేంద్ర స్వామి వారిని రథంపై ఊరేగిస్తున్న దృశ్యం

దుర్గి: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో వేంచేసి ఉన్న హరిహర బాల నాగేంద్రస్వామి వారి 33వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల రాకతో ఆలయ పరిసర ప్రాంతం హరినామ స్మరణతో మార్మోగింది. మహిళలు, యువతలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని రథంపై ఊరేగించారు. కోలాటం, పాటకచేరి, సాంఘిక నాటకాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.